క్లుప్తంగా

యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన జీవీఆర్‌నగర్ యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు ఆదివారం పునఃప్రారంభించారు. ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు నిలిచిపోవడంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి శనివారం 'యూజీడీ పంపింగ్ స్టేషన్ పూర్తయ్యేనా.?' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పునఃప్రారంభించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేందుకు విజయవాడ నగరపాలకసంస్థ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర వాసులకు వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో సమస్యలను అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం పవళింపు సేవ జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట ఆర్టీసీ సబ్ స్టేషన్ ఎంజీ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌స్టేషన్ ఏరియా, కంట్రోల్ రూమ్ ఏరియా, పట్టాభిరామయ్య వీధి, పాటిబండ్లవారి వీధి, ఆంజనేయస్వామి గుడి వీధి, పాట్టిస్వామి వీధి, తానియా హోటల్ ఏరియా, మందపాటివారి వీధి, టైర్ భవన్ రోడ్డు, బందర్ లాకులు ఏరియా, విజయ్‌కృష్ణ సూపర్ బజార్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'సంక్రాంతికి వస్తున్నాం' విజయోత్సవ వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విక్టరీ వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం రూ. 160 కోట్లు వసూలు చేసిన సందర్భంగా ఆదివారం గాంధీనగర్‌లోని అలంకార్ థియేటర్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. విక్టరీ రాణా యూత్ అధ్యక్షుడు పోతిన వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సురేష్ మూవీస్ మేనేజర్ భగవాన్, అలంకార్ థియేటర్ అధినేత కాకుమాను ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నమ్మి సాయి, పోతిన సాయి, జానీ, విజయ్, రాజగిరి గోపి, నాగోతి వాసు, పోతిన యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు





జీవీఆర్‌నగర్ గుణదల మార్గంలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్లు

- ఆక్రమణలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు
- ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే జీవీఆర్‌నగర్ గుణదల రోడ్డు మార్జిన్లు కుచించుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల బుడమేరు వరదల సమయంలో వరద ఉధృతికి మార్జిన్లు కుచించుకుపోయాయి. అలాగే బుడమేరును శుభ్రం చేసే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించారు. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. విశాలంగా ఉన్న ఈ రోడ్డుపై వాహనచోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మార్జిన్లు సక్రమంగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఈ మార్గంలో బయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు ఆందోళనగా ఎదురుచూడాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుడమేరు వైపు కనీసం ఫెన్సింగ్ నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయని చెబుతున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

ఒక పక్క బుడమేరు మార్జిన్లు ప్రమాదకరంగా మారగా.. మరోపక్క కొంతమంది మార్జిన్ల వద్ద మెరక వేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల యూజీడీ పంపింగ్ స్టేషన్ వద్ద ఒక బడ్డీని సైతం ఏర్పాటు చేశారు. ఈ ఆక్రమణలను అడ్డుకోకుంటే సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది. రామకృష్ణాపురం నుంచి దావు బుచ్చయ్యకాలనీ వరకు పలు చోట్ల మార్జిన్ల వద్ద భవన వ్యర్థాలు వేసి ఆక్రమణలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆక్రమణలు జరిగితే రాకపోకలకు మరింత ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు అవసరం

నిత్యం రద్దీగా సువిశాలంగా ఉండే ఈ మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల భద్రత పెరగడంతో పాటు బుడమేరును ఆక్రమణల చెర నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రోడ్డు మార్జిన్లు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వాహనాలు బుడమేరులోకి పడిపోతాయి. రాత్రి వేళల్లో జరగరానిది ఏదైనా జరిగితే ప్రమాద తీవ్రత అధికంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

– ఎం. వెంకట సుబ్బారావు, దావు బుచ్చయ్యకాలనీ

మార్జిన్లు సక్రమంగా లేవు



సువిశాలంగా ఉన్న ఈ మార్గంలో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే రోడ్డు మార్జిన్లు సక్రమంగా లేవు. అదేవిధంగా బుడమేరు పక్కన ఫెన్సింగ్ లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు ప్రమాదాలు జరిగిన తర్వాత కన్నా ముందుగానే నివారణ చర్యలు తీసుకుంటే మంచిది.

– ఎస్‌కే. అక్బర్, మధురానగర్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఎస్ఎన్‌పురంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తతో ఉండాలని, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఎన్‌పురం సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లుకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై నిరంతరం పోలీసుల గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. షీటర్లు పద్ధతి మార్చుకుని సత్ప్రవర్తన కలిగి ఉంటే వారిపై ఉన్న రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. అసాంఘిక చర్యలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా తక్షణమే వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

తెలుగు సంస్కృతి సాహితీ ట్రస్ట్ సేవలు అభినందనీయం



తాతారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చేతి వృత్తులలో విశేషంగా రాణిస్తున్న వారిని గుర్తిస్తూ వారిని తగిన రీతిలో సత్కరిస్తున్నామని తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని శ్రీపుల్లేటికుర్తి విశ్వబ్రహ్మణ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్సు, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్సు, మాచవరం సేవా ఫౌండేషన్ వారి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ కేఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండపి వెంకట గణేష్‌బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివస్వామి, ప్రముఖ పంచాంగకర్త పెదగాడి మోహన్‌రవి శంకర్, ప్రత్యేక అతిథిగా అయోధ్య రాముని లోహ పాదుకల రూపకర్త డాక్టర్ పెట్లంపల్లి రామలింగాచారి విచ్చేశారు. పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో గత ఏడేళ్లగా సామాజిక సేవలు అందించిన వెస్కో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని టీచర్స్ కాలనీ మూడో లైన్‌లో అజయ్ హైస్కూల్‌లో ఆదివారం శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యాన ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సేవా కేంద్రం ప్రధాన యోగాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా పొందాలనే ఉద్దేశంతో ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. యోగా శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు.

ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, అధికారులు



చిత్తరంజన్ గ్రంథాలయంలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంపత్‌కుమార్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఆదివారం ప్రజా కవి యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగి వేమన తెలుగు సాహితీ సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడని, హేతువాద దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి కవిగా ఖ్యాతి గాంచారని కొనియాడారు. సంఘసంస్కర్తగా 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు నేటికీ తెలుగువారి మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. వేమన రాసిన పద్యాలు 1839లో పుస్తక రూపంలో తొలిసారిగా సి.పి. బ్రౌన్ వెలుగులోకి తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ వేమన రచించిన పద్యాలు, శతకాలు చదివి అందులోని నీతిని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరళమైన భాషలో వేమన పద్యాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడంలో ప్రసిద్ధి చెందిన వేమన పద్యాలు అందరికీ అర్థమయ్యేలా ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. వేమన తెలుగు భాషలో కవి, తత్వవేత్త అని, రాష్ట్రంలోని కడపలో 1652వ సంవత్సరంలో జన్మించారన్నారు. ఇప్పటికీ ఆయన పద్యాలు అన్ని వర్గాలకు అర్థమయ్యేలా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డీఈఓ జ్యోతి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పా శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబు తదితరులు

వేమన పద్యం హృద్యం

విజయవాడ కల్చరల్: వేమన పద్యం హృద్యమని మోదుకూరు వేమన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముప్పా శ్రీనివాసరెడ్డి అన్నారు. మోదుకూరి వేమన జయంతి ఉత్సవ కమిటీ, తెలుగు కళావాహిని, పోలవరపు సాహితీ సమితి, కామ్రేడ్ జీఆర్‌కే సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం వేమన జయంతి వేడుకలను నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యం సామాజిక అంశాల సమాహారమని అభివర్ణించారు. విశ్రాంత లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ నేటి తరం బాలబాలికలకు వేమన పద్యాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. సాహితీవేత్తలు, ఎం ప్రభాకర్, బోడి ఆంజనేయరాజు, జీ కిరణ్ కుమార్, చింతకాయల చిట్టిబాబు, ఆర్ పిచ్చయ్య, చందు నాగేశ్వరరావు, కన్నయ్య వేమన సాహిత్యం– సమకాలీనత అంశంగా ప్రసంగించారు. నగరానికి చెందిన పలువురు గాయకులు ప్రబోధాత్మక గీతాలను ఆలపించారు.

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన



బందరు రోడ్డులోని సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత, గిరిజన ప్రజా సంఘాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించారంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను దళిత, గిరిజన, ప్రజా సంఘాలు వ్యతిరేకించాయి. ఈ మేరకు ఆదివారం బందరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద నిరసన చేపట్టాయి. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పదవికి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతపై అమిత్‌షా అహంకార పూరితంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన వ్యాఖ్యలను ప్రధాని మోడి ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తూ రిజర్వేషన్స్ లేకుండా చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ భారత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.నటరాజ్, జి. క్రాంతికుమార్, చింతల శ్రీనివాస్, జి. అరుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జైభీమ్ రావ్ పార్టీ అధికార ప్రతినిధి జి. కొండలరావు, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు గంజి రామారావు, ఆమ్‌ఆద్మీ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, ఆలిండియా కిసాన్ సంఘటన అధ్యక్షుడు మరీదు ప్రసాద్‌బాబు, జైభీమ్ జస్టిస్ యాక్సిస్ అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, కొప్పుల విజయ్, ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

నిర్వీర్యం దిశగా యూపీహెచ్‌సీ ల్యాబ్‌లు !

- శాంపిల్స్ సెంట్రల్ ల్యాబ్‌కు పంపుతున్న వైనం
- పైలట్ ప్రాజెక్టుగా కొన్ని యూపీహెచ్‌సీలు ఎంపిక
- గత ప్రభుత్వంలో అత్యాధునిక పరికరాలు సమకూర్చిన వైనం



లబ్బీపేట యూపీహెచ్‌సీలో అత్యాధునిక లేబొరేటరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని యూపీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండా, శాంపిల్స్‌ను సెంట్రల్ ల్యాబొరేటరీకి పంపేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకోసం ప్రస్తుతం కొన్ని యూపీహెచ్‌సీల్లో పైలట్ ప్రాజెక్టుగా పరిశీలన జరుపుతున్నారు. ఇప్పటికే యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రోగులకు సైతం సత్వరమే రిపోర్టు వస్తుండగా, మళ్లీ బయటకు పంపితే రిపోర్టు ఎప్పుడు వస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. ఇక్కడ అందుబాటులో లేని పరీక్షలకు సంబంధించి శాంపిల్స్ పంపించాలే కానీ, అన్ని శాంపిల్స్ పంపితే రోగులు ఇబ్బందులు పడే అవకాశం ఉందంటున్నారు.

ఇప్పుడేం జరుగుతుంది..

గత ప్రభుత్వం యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక ల్యాబొరేటరీ పరికరాలు సమకూర్చింది. ఒక్కో యూపీహెచ్‌సీలో రూ.50 లక్షలు విలువ చేసే పరికరాలు ఏర్పాటు చేసింది. దీంతో 60 రకాలకు పైగా పరీక్షలకు అక్కడే చేస్తున్నారు. అందుకోసం ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమించి, వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. దీంతో వ్యాధి నిర్ధారణ ఇక్కడే జరిగిపోతుంది. రోగికి అవసరమైన మందులను వైద్యులు ఇచ్చి పంపుతున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం సేవలు సజావుగా సాగుతున్నాయి.

కొత్త విధానం ఇలా..

సిద్ధార్థ వైద్య కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధునాతన లేబొరేటరీల కోసం అధునాతన భవనాలు నిర్మించారు. వాటిలో వ్యాధి నిర్ధారణ పరికరాలు ఏర్పాటు చేసి, సెంట్రల్ ల్యాబ్‌లను నిర్వహించనున్నట్లు తెలిసింది. దీంతో నగరంలోని యూపీహెచ్‌సీల్లో బ్లడ్ శాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షల కోసం అక్కడకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలా జరిగితే ఫలితాలు వచ్చేందుకు తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉంది. ఓపీ మొత్తం అయిన తర్వాత శాంపిల్స్‌ను అక్కడకు తీసుకెళ్లి, అక్కడ పరీక్షల అనంతరం రిపోర్టులు వచ్చే సరికి సాయంత్రం అయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు ఎప్పుడు శాంపిల్స్‌ను అప్పుడు పరీక్షలు చేస్తున్నారని, కొత్త విధానంలో ఫలితాలకు జాప్యం జరిగే అవకావం ఉందని నిపుణులు అంటున్నారు.

లేబొరేటరీలను కొనసాగించాలి..



యూపీహెచ్‌సీల్లో లేబొరేటరీలను కొనసాగించాలి. ఇక్కడ అందుబాటులో ఉన్న 60 రకాల పరీక్షలను ఇక్కడే నిర్వహించాలి. ఇక్కడ లేని పరీక్షలకు సంబంధించిన శాంపిల్స్‌ను సెంట్రల్ ల్యాబ్‌కు పంపాలి. అంతేకాని అన్ని శాంపిల్స్ పంపితే రోగులకు రిపోర్టు జాప్యం జరిగి ఇబ్బంది పడే అవకాశం ఉంది.

– సయ్యద్ అలీం, కో ఆప్షన్ సభ్యుడు

ఘనంగా ఏఎంసీ వార్షికోత్సవం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ ఏడవ వార్షికోత్సవాలు సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని గంగానమ్మ దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని మాట్లాడారు. ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కష్టపడి పని చేస్తున్న కమిటీ ఏదైనా ఉంది అంటే అది ఆజాద్ ముస్లిం కమిటీయే అని అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని, జగనన్న పాలనలో ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని గుర్తుచేశారు. షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలందరిని ఒకతాటిపై తీసుకువచ్చి ఐక్యంగా ముందుకు నడవాలనే ఆకాంక్షతో ఈ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. ప్రజా కాపునాడు రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, ఎస్ఎస్‌యూవి స్టేట్ జనరల్ సెక్రటరీ వేముల శ్రీనివాసరావు, తెనాలి అమీర్‌సాబ్ షేక్ రఫీ, ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్‌అలీ, అబ్దుల్ అజ్మతుల్లా, సయ్యద్ మౌలాలి, షేక్ ఇమ్రాన్, షేక్ సమీనా ఫాతిమా, షేక్ మస్తాన్, షేక్ షాకీర్, షేక్ రహీం, సభ్యులు పాల్గొన్నారు.

'వయోవృద్ధ' సేవలు అజరామరం



వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్న వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అజరామరం అని క్వినిక్స్ కార్పొరేషన్ ఎండీ ఆనంద్‌రెడ్డి బాలిరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ దాతలు, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రటరీ బత్తుల సుందర్‌రెడ్డి, ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, మధుసూధనరావు, లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని శ్రీ మరకత రాజరాజేశ్వరీ క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం యనమండ్ర శ్రీనివాసశర్మ సంగీతంలో జ్ఞానదృష్టి అంశం గానూ, సంస్కృత పండితులు యనమండ్ర వేణుగోపాల శాస్త్రి ఉపాసనా విశిష్టమైన భక్తిని వివరించారు.